# టెలిఫోన్

ఆయన ఆఫీసు గదిలో ఉంది టెలిఫోన్.

నల్లగా, నున్నగా, ముద్దొస్తూ. ఆమె రోజూ తుడుస్తుంది, షామోయ్ గుడ్డతో. మెరుగు పెడుతుంది. తను వంటింట్లో ఏ పోపు వేయిస్తుంటేనో అది మోగుతుంది. ఆమెకు చిరాకు, ఆత్రం, ఆశ. ఒక నిమిషం మోగనిస్తుంది, 'ఏడవనియ్యి - ఏడ్చుకోనియ్యి' అన్నట్లు. పోపు వదిలిపెట్టి పోతే మాడిపోతుంది. 'వెధవ ఫోను', అనుకుంటుంది, ఆప్యాయంగా. కాని మోగి మోగి ఆగిపోతుందేమోనని భయం. అవతలిగొంతు వినాలని కుతూహలం. కాని ఫోన్ పెంకిది. ఆగదు. మోగుతూనే ఉంటుంది. పోపు దింపి ఆమె ఆఫీసు గదిలోకి వెడుతుంది. వెంటనే ఫోన్ ఎత్తదు. మరో రెండుసార్లు మోగనిస్తుంది. మూడోసారి రెండో 'ట్రింగ్' అనకుండానే తీసి చెవిదగ్గర పెట్టుకుంటుంది. వెంటనే 'హలో' అనదు. అవతలింటి మలయాళీ ఇల్లాలు ఎవరితోనో ఎప్పుడూ మాట్లాడుతుంటుంది.

కిటికీలోంచి ఆమెను చూస్తూ, 'మిసెస్‌రావ్ హియర్' అంటుంది. అవతల మలయాళీ ఇల్లాలు విరగబడి రొమ్ములు ముందుకు విరిచి నవ్వుతుంటుంది. ఆమె బొమలు ముడివేసి ఆ దృశ్యం అయిష్టంగా

చూస్తూ టెలిఫోన్ గొంతు వింటుంది.

"రావుగారున్నారాండి?"

ఆ బుగ్గమీసాల ప్రౌఢవయస్కుడెవరో కొత్తవాడు. ఇదివర కెప్పుడూ ఆ మలయాళీ ఇల్లాలితో అతన్ని చూడలేదు. సిగ్గులేక పోతేసరి, ఏమిటా విరగబాటు, పరాయి మొగాడిముందు?

"లేరండి. ఆఫీసుకెళ్ళారు. ఈ వేళప్పుడు ఎప్పుడూ ఇంట్లో ఉండరే."

ఆయన లేరని తెలిసే ఫోన్ చేశాడా ఆసామీ? ఆ గొంతులో ఏదో జులాయితనం ఉంది. పరాయి మొగాడితో మలయాళీ ఇల్లాలు గదిలోకి వెళ్ళింది. ఎంత తెగింపు! ముగ్గురు బిడ్డలతల్లి! మొగుడు రబ్బరు ఫాక్టరీలో పెద్ద ఉద్యోగి.

"రావూ నేనూ క్లాస్‌మేట్స్‌మండి. నా పేరు యజ్ఞనారాయణ. ఎగ్గెన్నంటే వాడికి తెలుస్తుంది. నేను రిట్జ్‌లో ఉన్నాను. రూం నెంబరు 14. వాడితో చెప్పండి - ఓ వారమైంది దేశంలో దిగి. కెనడాలో ఉంటున్నాను. ఈవేళే వొచ్చా నీ వూరు."

"అలాగే చెపుతానండి."

ఆ గొంతు ఇంకా వినాలని ఉంది, అసలు ఆ ఎగ్గెన్న ఎలాంటి వాడో తేల్చుకోడానికి. కాని అవతల క్లిక్‌మంది. నిట్టూర్చి ఆమె ఫోన్ పెట్టేసింది. అవతల ఇంటి మలయాళీ ఇల్లాలు 'టాటా' చెపు తోంది, ఆ బుగ్గమీసాల ఆసామీకి. ఇల్లంతా ఖాళీగా ఉంది. పిల్లలు స్కూళ్ళకి పోయారు, మొగుడు రబ్బరు ఫాక్టరీకి పోయాడు. ఇష్టారాజ్యం భరతుడి పట్టం. మరి, అప్పుడే వెళ్ళిపోతున్నాడేం బుగ్గ మీసాల ఆసామీ? సుందరమ్మ - ఎదురింటి స్కూలు మేష్టరు పెళ్ళాం స్పష్టంగా చూసినట్టు చెప్పింది, ఆ మలయాళీ ఆవిడ గుణం మంచిదికాదని. ఆవిడ కసలు ఎలా తెలిసింది? కానిపనులు అంత కనిపించేటట్టు చేస్తారేమిటి ఎవరైనా? ఏదో కాస్త వెకిలిగా నవ్వినంత మాత్రాన్న లేనిపోనివన్నీ ఆవిడికి అంటగట్టడం

అన్యాయం. అయినాగాని, అసలు ఆ సుందరమ్మది మాత్రం ఏమంత మంచి గుణమని? అయినవాడి తోటీ కానివాడితోటీ అర్ధరాత్రి సినిమాలకి తిరుగుతుంటుంది. తన పడక గది కిటికీలోంచి స్పష్టంగా చూసింది, ఎన్నోసార్లు - అర్ధరాత్రి ఏ మూడు గంటకో ఎవరో మొగాడు రిక్షాలో దింపిపోవడం.

సుందరమ్మ అందని కాదుగాని, మొత్తంమీద మలయాళీ ఆవిడ అంత మంచి మనిషిలా కనబడ్డంలేదు.

కిందికి దింపినా పోపు మాడిపోయింది. వెధవ ఫోను. వంటింట్లోంచి వెనక ఇంటి ప్రహరీగోడపైన, మేడమీద వాటావాళ్ళు కనిపిస్తారు. మొగుడూ పెళ్ళాలు ఎప్పుడూ కీచులాటే. పెద్దగా గొంతుకలు వినిపిస్తాయిగాని, అసలు తగాదా ఏమిటో ఆమెకు ఆచూకీ దొరకలేదు. ఆయనకి పైతిరుగుళ్ళున్నాయేమో. మొగరాయుడు. బాగుంటాడు మనిషి. ఆవిడ మొహం మాత్రం ఎప్పుడూ తుమ్మల్లో పొద్దు కుంకినట్టుంటుంది. పిల్లలు లేనట్టున్నారు. తనకీ లేరు. అంత మాత్రాన్నే ఆయన ఇంటికి రాగానే కస్సూ బుస్సూమంటుందా? ఏదో ఉంది కారణం.

తను మొదటినించీ ఎంత పవిత్రంగా ఉందో తలుచుకుంటే ఆమెకు గర్వం. చదువుకునే రోజుల్లో ఎన్ని అవకాశాలొచ్చాయి, చెడిపోవడానికి! తన స్నేహితురాళ్ళు ఎంతమంది చెడిపోలేదు? తను మాత్రం నిప్పులా నిలబెట్టుకుంది తన పవిత్రత. తనకిమాత్రం అవకాశాలు లేకనా? చక్కని మనిషినని తనకే తెలుసు.

కూరలో పోపువేసి, చీరచెరగుతో మొహం తుడుచుకుంది. అబ్బ... ఉక్క. మళ్ళీ స్నానం చేస్తా. ఫోన్ మోగితే ఈలోగా? దాని ఖర్మ.

ఆమె స్నానం చేస్తుండగా ఫోన్ మోగింది. స్నానం సంతృప్తిగా పూర్తికాలేదు. తడిఒంటిమీద చీర చుట్టబెట్టుకు వెళ్ళింది అదల్లా మోగుతూంటే తోచదు, చంటిపిల్లవాడి ఏడుపులాగా. ఫోన్ ఎత్తి 'హలో' అంది. ఇంతాజేసి రాంగ్ నంబరు. ఛండాలం. ఫోన్ పెట్టి

తిరిగి బాత్‌రూంలోకి వెళ్ళబోతుంటే కిటికీలోంచి పక్కయింటి మలయాళీ ఆవిడ పలకరించింది. చురుకుమనే సూదిచూపుల్లా ఆవిడ కళ్ళు మీదపడేసరికి ఆమె చర్మం ముడుచుకుపోయింది. కాని కాస్త పరిశీలించి చూస్తే ఆ చూపుల్లో ఆకలి ఏమీలేదు. వట్టి ఆత్మ అప్యాయత. ఆవిడ భోజనంచేసి ఏదో సినిమాకి పోతోందట. తన్ను కూడా రమ్మంది. తనకి తీరదంది ఆమె. ఇల్లు తాళంవేసి పోవడానికి రోజులు బాగాలేవు. అదీగాక అయిదింటికి ఆయన ఇంటికొస్తే తలుపుతాళం వేసి ఉంటుంది. పాపం ఆయనకు రాగానే టీ కావాలి. మలయాళీ ఆవిడ అదేం ఫరవాలేదంది. అన్ని గదులూ తాళంవేసి, హాలుతెరిచి అందులో తమ సర్వెంటుని కూర్చోబెట్టి వచ్చు. చాలా నమ్మకమైనవాడు. రావుగారు రాగానే తమ వంట మనిషి టిఫినూ, టీ పట్టుకొచ్చి ఆయన కిస్తుంది. అరింటికల్లా తమెల్లాగా వచ్చేస్తారు. కాని మిసెస్‌రావు క్షమించమంది. సగం సబ్బుపట్టించుకున్న వొళ్ళు ఇక్కడా అక్కడా ఆరిపోయి బిగుస్తోంది. ఆమె స్నానం పూర్తిచెయ్యడానికి వెళ్ళిపోయింది. నున్నటి వొంటిమీద నీళ్ళుపడి జారుతుంటే అప్యాయంగా రుద్దు కుంది. మళ్ళీ సబ్బు పట్టించింది. మళ్ళీ రుద్దుకుంది. మలయాళీ ఇల్లాలివొళ్ళు ఇంత బిగువుగా ఉంటుందా? ఎలా ఉంటుంది. ముగ్గురు బిడ్డలతల్లి. నిగనిగ, బిగువు సడలనివొళ్ళు పవిత్రమైనది. గుళ్ళో పార్వతీదేవి శిలావిగ్రహంలో ఎంత దైవత్వముంది! తనకి పిల్లలు పుట్టినా, పదిమంది పిల్లలు పుట్టినా, తనవొళ్ళు సడలిపోదు. పార్వతీదేవి వొళ్ళులాగ. ఎదురింటి సుందరమ్మ పొట్ట ముడతలు పడిపోయింది. ముప్పైఏళ్ళకే. ఆవిడికి అదేం పొయ్యేకాలం. బొడ్డు కిందికి కడుతుంది చీర? సంచిలాగ కడుపు చీరకట్టు పైకి వేలాడు తుంటే డోకు. తను ఎప్పుడూ బొడ్డుకిందికి కట్టదుచీర. కొంప మునిచి వీధి అవతలి ఎదురింట్లో హిప్పీగాడు తన్ని చూడలేదు గదా? ఇందాక తడివొంటిమీద చీర చుట్టుకుని తను ఫోన్ ఎత్తి నప్పుడు. సాధారణంగా ఈ వేళప్పుడు ఇంట్లో ఉండడు. కాలేజీకి

పోతాడు. ఏమో కాలేజీ ఎగ్గొట్టేసి గది కిటికీలో కూచోలేదుగదా, తన్ను చూడ్డానికి? ఏమిటీపిచ్చి? తను స్నానం చేస్తుండగా ఫోన్ మోగుతుందనీ, తను తడిబట్టతో వొచ్చి ఫోన్ ఎత్తుతుందనీ, వాడే మన్నా కలగంటాడా? ఏమో, వాడెంతకైనా తగును.

ఆఫీసు గదిలోకివెళ్ళి కిటికిలోంచి చూసింది ఎదురింటివైపు. వాడిగది కిటికీ తెరిచేఉందిగాని లోపల చీకటిగా ఉంది. వాడున్నట్టు లేడు. రాత్రి రొండింటికి పెడతాడు వెధవ, ఏవో పిచ్చి రికార్డులు. ఏదో వుడ్‌స్టాక్‌ట. పిచ్చి అరుపులు, పిచ్చిగోల. చదువుకునే వెధ వకి ఈ పోకడలన్నీ ఏమిటి? నిజంగా వాడు చదువుతున్నాడా? వాడి కిందవాటాలో ఉంటుంది సుందరమ్మ. 'తమ్ముడు చాలా మంచివాడు' అంటుంది. 'తమ్ముడు' ఎలాంటి తమ్ముడో. వాడు తనవంకే ఇంట్లో ఉన్నంతసేపూ చూస్తుంటాడని ఆమె అనుమానం. అయితే నల్లకళ్లజోడు వెనక వాడికళ్ళు ఎటువైపు చూస్తున్నాయో తెలియదు. సందేహం లేదు. వాడు వట్టి జులాయిమనిషి. సుంద రమ్మ వాణ్ణి తమ్ముడంటుంది. 'తమ్ముడు'.

ఎంతసేపటికీ మోగదేం ఫోను? అయినా తనెందుకు కాచుకు కూర్చోవాలి? తిండితిని పడకేస్తేసరి. ఆయనకు కారియరు సిద్ధంగా పెడితే నౌకరొచ్చి పట్టుకుపోతాడు. ఊరగాయి ఏది వెయ్యాలి. మెంతికాయ వేస్తేసరి. కూర బాగాలేదు, పోపుమాడిన వాసన. రెండు బెండకాయలు వేయించేస్తే? ఇంకా టైముంది. పదకొండేగా అవుతా. పన్నెండింటికిగాని రాడు నౌకరు. మంచికూర చెడి పోయింది. బొప్పాసికాయ పొట్టుకూర ఆయనకెంతో ఇష్టం! ఆవ పెట్టి పనసపొట్టుకూరలా వొండితే. పోపుమాడిపోతే బాగుండదు. వెధవ టెలిఫోను ప్రాణం తీస్తోంది. ఈసారి అరిచి చచ్చినాసరే ఎత్తను.

టెలిఫోన్ మోగింది.

ఆమె నిర్లక్ష్యంగా వెళ్ళిపోయింది. ఏమయినా సరే ఎత్తను అను కుంది. కూరలబుట్టలో బెండకాయలుతీసి కుళాయి దగ్గర కడిగింది.

కత్తిపీట తెచ్చింది. స్టీలుపళ్ళెం ముందు పెట్టుకుంది. టెలిఫోన్ మొగమాటపెడుతూ మోగుతూనేఉంది. ఒకకాయ కసిగా తరిగింది. కసిగా లేవకుండా కూర్చుంది. మోగనీ దానికి విసుగెత్తేదాకా. రెండో కాయ సగం తరిగింది. అబ్బ, ఏమిటంత పట్టుదల దానికి? ఫోను ఆత్రంగా మోగింది. ఏదో జరుగురుపని ఉన్నట్టు. ఆమె ఊపిరి గబగబ పీల్చుకుంది. ఫోనుకి తొందర ఎక్కువైంది. 'ఛీ! నా ప్రాణం తీస్తోంది', ఆమె లేచింది. ఫోన్ కసిగా మోగింది. ఆమెమీద, పగతీర్చుకోడానికి. ఆఫీసుగదిలోకి వెళ్ళిందామె. తనకి తెలుసు ఎవరు ఫోన్ చేస్తున్నారో. రామంగారు సరిగ్గా ఇదేవేళకి చేస్తుంటాడు, వారానికోసారో రెండుసార్లో. ప్రతిసారీ తిట్టాలనుకుంటుంది. 'ఎందు' కని మానేస్తుంది. తనతో చదువుకున్నాడు. ఏడాదైంది ఆ వూరు బదిలీ అయి. పెళ్ళాం, ఇద్దరు పిల్లలూనట. ఎప్పుడూ తన ఇంటికి రమ్మంటాడు. ఎలా వెడుతుంది? వాడి కసలు సిగ్గుండొద్దు? ఆరోజున - పదిహేనేళ్ళక్రితం గోదావరి తిప్పమీద అంతగొడవ జరిగాక?

నడుంమీద చేతులువేసి కక్షగా చూసింది ఫోన్‌వంక. ఈవేళ గట్టిగా బుద్ధి చెబుతా వెధవకి. చెయ్యిజాపింది. ఫోన్ ఎత్తడానికి పట్టుకుంది. ఎత్తబోతుంటే ఫోన్ ఆగిపోయింది. తనమీద తనకే కోపం వచ్చింది. తను ఫోన్‌కేదో అన్యాయం చేసినట్టు. వెంటనే కసి - వాడికంతే జరగాలి. ఆ రామంగాడికి. వెనక్కి తిరిగింది. ఆఫీసుగది గుమ్మం దాటబోతుంటే మళ్ళీమోగింది. ఆత్రంగా వచ్చింది, ఫోన్ దగ్గిరికి. గుండెలు వొళ్ళంతా కొట్టుకున్నాయి. ఆగిపోడానికి అవకాశం ఇవ్వకుండా ఎత్తింది. 'హలో' అందామంటే ఊపిరి అందలేదు, ఆత్రం మూలంగా.

"నువ్వేనా?" రావుగారి గొంతుకేనా అది?

"ఊ"

"రాత్రి ఎనిమిదింటికి పెర్సీస్‌కిరా. టాక్సీలో."

కోపంతో ఊపిరిసలపలేదు. ఈ టెలిఫోన్లు పెట్టింది నాగరిక వ్యభిచారానికా?

"మిస్టర్? విజిలెన్స్‌వాళ్ళని కూడా వెంటబెట్టుకొస్తా. నీ అంతు తేలుస్తా. సంసారుల ఇళ్ళకి ఇలా ఫోన్‌వేసి, మొగవాళ్ళింట్లో లేనప్పుడు, ఆడవాళ్ళని బుట్టలో వేసుకోడానికా టెలిఫోన్ డిపార్టు మెంటు ఈ సౌకర్యం ఏర్పాటుచేసింది? ఇప్పుడే ఫోన్‌వేసి ఏ నంబర్ నుంచి కాల్ వచ్చిందో కనుక్కుంటూ, నువ్వెవరో కనుక్కుని నీ అంతుచూస్తా."

అవతలి మనిషి ఊపిరి వెటకారంగా పీల్చుకున్న సవ్వడి. "ఫోన్ పెట్టెయ్యండి."

"అమ్మో, సీతామహాసాధ్వీ! ఏమిటా వెటకారం!"

"నేనింకొక అనుకూలవతి ఇంటికి ఫోన్‌వేస్తే యంత్రం పొరబాటున మీ ఇంటికి కనక్షన్ ఇచ్చింది. రాంగ్ నంబరు. మీ గొంతు విని మా ఆవిడది అనుకున్నాను. మాటతీరు వేరని మొదట్లో తెలియలేదు. తరవాత కుతూహలంకొద్దీ విన్నాను. ఒక్క విషయం. పెర్సీస్ హొటల్‌కి సరసులూ సానులూ వస్తారేమో నాకు తెలియదు. భార్యాభర్తలు కూడా వస్తారు. అయినా యంత్రం చేసిన పొరబాటుకి మీరంతగా ఆవేశపడ్డం తప్పు. సెలవు."

ఆమెకు చిరాకు, కోపం, దిగులు. ఎంత అవమానం! ఆ పెద్ద మనిషి రాంగ్‌నంబరని పెట్టెయ్యొచ్చుగా? అంత ఉపన్యాసం ఎందుకు? తన గుణం మంచిది కాదుగనకే తనంత ఆవేశపడిం దన్నట్టు. నిజంగా పతివ్రత అయితే అంత ఆవేశపడదన్నట్టు మాట్లాడాడు- ఆ పెద్దమనిషి. ఆ మాట అనకపోయినా ఆ ధ్వని ఉంది.

బెండకాయలు కసిగా వేయించింది. కూరియపరు నరిదింది. మనసు కుదుట పడింది. నిజంగా పెర్సీస్‌కి భార్యాభర్తలొస్తారా? లేకపోతే వొచ్చినవాళ్ళు భార్యాభర్తలుగా నటిస్తారా? ఒక్కసారయినా అయన తనని పెర్సీస్‌కి తీసికెళ్ళలేదు. ఎప్పుడో అయిదేళ్ళ క్రితం

తీసికెడతా నన్నారు. ఒకసారి తనే రానంది. తన అందం చందం చూసి, ఏదో 'సరుకు' అనుకుంటారు పదిమందీ అంది. తను రావు గారి భార్య అని వాళ్ళకి అర్థంకాదనంది. అక్కడి వాతావరణం అలాంటి దనంది. ఆ తరవాత ఆయన హోటల్‌కి రమ్మని ఆమెను ఎన్నడూ అడగలేదు. పెర్సీస్‌కి నిజంగా భార్యాభర్తలొస్తారేమో, తను వెళ్ళి చూడాల్సింది. పక్కయింటి మలయాళీ ఇల్లాలు ఎప్పుడైనా వెళ్ళిందేమో, భర్తతోటి, లేకపోతే ఆ బుగ్గమీసాల ఆసామితో వెళ్ళుంటుందా! ఛీ!

నౌకరు ఎందుకు రాలేదో ఈవేళ. అప్పుడే పన్నెండు. సోఫా మీద నడుంవాల్చింది. ఎంత పవిత్రంగా కాపాడుకుంటూ వచ్చిందీ శరీరాన్ని! కన్నెప్రాయం నించీ!

కాలేజీలో చదివే రోజుల్లో - గోదావరి తిప్పమీదికి పిక్నిక్‌కి వెళ్ళారు - తనూ సావిత్రీ, శకున్తా, సుబ్బులు -- ఒక డజను మంది ఆడపిల్లలు. వైశాఖపూర్ణిమ. అప్పుడే పి.యు.సి. పరీక్షలైపోయాయి. ఇప్పుడు పి.యు. లేదు. ఇంటర్ కాబోలు. ఎలా తెలిసిందో డజను మంది మగపిల్లలు తయారయ్యారు, ఇంకో పడవలో. అప్పుడు మంచి గుండెధైర్యం ఉండేది తనకి. మిగతా ఆడపిల్లలు బెదిరిపోయారు. తనొక్కత్తే ధైర్యంగా నిర్లక్ష్యంగా ఉంది. చాలా జాగ్రత్తగా మగ పిల్లలు మా దగ్గరకు చేరారు. తెచ్చుకున్న మినపరొట్టి మాకందరికీ పెట్టారు. రామం నాకిచ్చాడు. నేను తాకలేదు. మిగతా ఆడపిల్లలు తిన్నారు. మొదట సంకోచంగా తరవాత చనువుగా. వెన్నెలైనా ఉక్కగా ఉంది. మిగతా ఆడపిల్లలు సన్నసన్నగా కిచకిచ నవ్వడం మొదలుపెట్టారు, మగపిల్లల ఛలోక్తులకి. నేను మాత్రం విరుసవైనా నవ్వలేదు. ఎలా పలచబడ్డారో జనం. పదీపదిస్నర అయేసరికి ఆడ పిల్లలు మాయమయారు మగపిల్లలతోపాటు. నేనొక్కత్తెనే మిగిలాను. దోసపాదు పక్కనించి వచ్చాడు రామం.

"మంచి దోసకాయలున్నాయి. దోరకాయలు కోద్దాం రా!" అన్నాడు.

నేను వెటకారంగా నవ్వాను. 'దోర' కాయలంటే నా కంతమోజు లేదన్నాను. తనకీ లేదన్నాడు. నాపక్కని కూర్చున్నాడు. ఎలా దిగామో గుర్తులేదు. పతివ్రతల కథలను గురించిన చర్చలోకి దిగాం. ఆ ప్రస్తావన నేనే తెచ్చానేమో.

"అహల్యని ఇంద్రుడు మోసం చెయ్యలేదు. ఇంద్రుణ్ణి చూసి, మోహించింది అహల్య" అన్నాడు రామం.

"అబద్ధం" అన్నాను.

"వాల్మీకంలో అలాగే ఉంది. కావాలంటే ఆ ఘట్టం అప్పజెప్పు తాను. తరవాత నీలాంటివాళ్ళెవరో అహల్యని పతివ్రతని చెయ్యడానికి కట్టుకథలు కల్పించారు" అన్నాడు రామం.

సంస్కృతంలో రామం ఫస్టు. అతను చెప్పింది నిజమేనేమో, అయినా నాకు నమ్మాలనిలేదు. నన్ను బుట్టలో వేసుకోడానికి ఈ ప్రస్తావన తెచ్చాడు రామం. తెలుస్తూనే ఉంది.

"అహల్య ఎలాంటిదైతే నాకేం?" అన్నాను.

రామం చిత్రమైన సిద్ధాంతం వివరించాడు. పాతివ్రత్య మనేది, పురుషుల స్వార్థంకోసం వాళ్ళే ఏర్పాటు చేసుకున్న ఆదర్శమట. నిజమైన పతివ్రత సహజమైన కోరికలన్నీ చంపుకుని లోపలంతా కరడుగట్టిపోయి ఆఖరికి మనిషికూడా కాకుండా పోతుందట. మనసు, తనువు, ఆత్మ, ప్రేమ అనే అమృతంతో ప్లావితమైనప్పుడే (పండితు డనిపించుకోవాలని ఆరోజుల్లో తపన ఉండేది రామానికి. అంచేత మామూలు సంభాషణలోకూడా బరువైన పదాలు ధారాళంగా దొర్లిస్తుండేవాడు) మనిషి అమరానుభూతి పొందుతాడట. ఇలా ఒక గంట డొంకతిరుగుడుగా సిద్ధాంత వివరణచేసి ఆఖరికి చెప్పాడు. నేనంటే తను పడిచచ్చిపోతున్నాడట. నేను ఊ అనకపోతే తను ఆత్మహత్య చేసుకుంటాడట. నేను పక్కనేఉన్న గోదావరి చూపించాను. అతను వెర్రెక్కిపోయాడు. ఎలాగైనా నన్ను తనదాన్ని చేసుకుంటానన్నాడు. వణుకుతున్న చెయ్యి నా

మీద వేశాడు, అప్పుడు నాకు కోపంకూడా రాలేదేమో! అతితాపీగా అతన్ని తోసేసినట్టు గుర్తు.

ఆ తరవాత ఎన్నోసార్లు నావంక ఆకలిచూపులు చూస్తూ నా వెంట తిరిగేవాడు, నా బి.ఏ. అయిపోయేదాకా. అయినా నేను చలించలేదు.

తను సెకండ్ బి.ఏ.లో ఉండగా, అతను బి.ఏ. పాసయి ట్యూటర్‌గా వచ్చాడు. ఉద్యోగం వచ్చిన తరవాత చిత్రమయిన చిరునవ్వు అలవాటు చేసుకున్నాడు. వెటకారపు చిరునవ్వు. తన పొజిషన్ నిలబెట్టుకోడానికి. ఎవరూ వినవప్పుడు తన్ను 'రాయీ' అని పిలుస్తుండేవాడు.

మరో ఆడపిల్లయితే రామానికి లొంగిపోయేది. నిజంగా రామం అందగాడు. చురుకైనవాడు. మంచి చలాకీ, మాట చమత్కారం ఉన్నవాడు. అయినా తను లొంగలేదు. ఒకవిధంగా రావుగారికంటే అతనికే ఆకర్షణ ఎక్కువుంది. అయితే - రావుగారు తన భర్త. రామం పరాయిమొగాడు. భర్త ఎలాంటివాడనికాదు. భర్తకావడమే అతని గొప్ప. ఆ గొప్ప రామానికిగాని, మరో ఆసామీకిగాని ఎలా వస్తుంది? రామం పెళ్ళాం ఎలా ఉంటుందో.... తనంత అందంగా ఉంటుందా?

నిద్ర. నిద్రలో కల.

గండిపేట. తనూ, భర్త. మూడో ఆయనెవరు? అవును. ఎగ్గెన్నే. పేరు విని మోసపోయింది. మహచురుకైనవాడు, అందగాడు కూడా. భర్త నుద్దేశించి మాట్లాడినా, నిజంగా అవన్నీ తను వినాలనే. 'నీ శ్రీమతి రియల్ బ్యూటీ'. 'అజంతా' శిల్పాల్లాంటి స్త్రీలు నిజంగా ఉంటారని నేను ఊహించనైనాలేదు.' 'షేక్స్‌పియరు ఎంత బాగా అన్నాడురా, క్లియోపాత్రని గురించి. ఆమె అనంత వైవిధ్యం, వయసుతో వాడదు, తరుచు చూస్తున్నా తరగదు'.

గండిపేట ఎత్తైన గట్టు. అవతల కనుచూపుమేరవరకూ నీరు. తను ముఖమల్ తివాచీ పరిచిన శయనాగారంలో ఉంది - అంతః

పురం పైఅంతస్తు మీద. అవతల కనుచూపుమేర వరకు నీరు. నదా, సముద్రమా ? శయనాగారానికి ఒక కొనని జిలుగుపనిచేసిన బాల్కనీ. తనముందు అపురూప సుందరుడు మోకరించి ఉన్నాడు - రామం. ఆత్మార్పణం చేసుకుంటున్నాడు. తాను పరకీయ. భర్తే తన సర్వస్వం. భర్తే తన దైవం. తన కళ్ళకు ఇతర పురుషుల అందం ఆనదు, ఆర్తి వినపడదు. రామం దీనంగా, ఆవేశంతో అంటున్నాడు - తనవంటి స్త్రీ అజంతా, తాజ్‌మహల్‌లాగ లోక కాలాలకు అతీతమైనది. ఆ దివ్యసౌందర్యం ఒక్కమగని సొత్తు కావడం అన్యాయం, అసహజం. సౌందర్యోపాసకులకందరికీ కలాహృదయులకందరికీ చెందిన అపురూప నిధి. ఆమె యెదలో తియ్యని గంటలు మోగాయి. గంటలు కావు. చిత్రమైన వాద్యం - దిగులుకూ ఆనందానికీ అతీతమైన వాద్యం.

"ట్రింగ్ — ట్రింగ్.... ట్రింగ్ ట్రింగ్."

ఎంతసేపటినించి మోగుతోందో టెలిఫోన్. కళ్ళునులుపుకుంటూ లేచిందామె. టెలిఫోన్ చిరాకుగా మోగుతోంది. గడియారం వంక చూసింది. మూడు. అబ్బ ! ఎంతసేపు పట్టేసింది నిద్ర ! కారియరు అక్కడే ఉంది. నౌకరెందుకు రాలేదో ?

"హలో"

"ఎగ్గెన్ననండి. యజ్ఞనారాయణని."

"ఆయన ఆరయితేనేగాని ఇంటికి రారండి."

"మధ్యాహ్నం నాతో ఇక్కడే లంచ్ తీసుకున్నాడు. రాగానే ఫోన్ చేశాడు. ఎంచేతో నంబరు దొరకలేదు - మీ ఆయన్ని లంచికి ఆపేసినందుకు క్షమించండి."

"ఫరవాలేదండి."

"అసలు నేను ఫోన్ చేసింది అందుకు కాదు. రాత్రి డిన్నర్‌కి రమ్మన్నాను వాణ్ణి. మీరు కూడా వొస్తే సంతోషిస్తాను."

"అయనేమన్నారు ?"

"తప్పకుండా వొస్తాడు. చిన్నతనంలో పదేళ్ళకలిసి చదువు కున్నాం. అయిదేళ్ళయింది వాణ్ణి చూసి. పొద్దున్న ఫ్లైట్‌లో వెళ్ళి పోతున్నాను - అంచేత."

"మా ఇంట్లోనే కూర్చోవచ్చుగా."

"మా మొగాళ్ళం కొంచెం వెధవలమండి. ఏవో అలవాట్లుం టాయి..."

"నాకు తెలుసు. ఆ అలవాట్లకి మా ఇంట్లోనూ అభ్యంతరం ఉండదు. ఆయనకి నేనే సర్వ్ చేస్తుంటాను - అప్పుడప్పుడు."

"చెప్పాడు. అయితే మీ ఇంట్లో కుక్ లేడట. మీరే వొద్దన్నారట. మీరు వంటింట్లో తంటాలు పడుతుంటే మేం సుఖంగా డ్రాయింగ్ రూంలో కూర్చుని తాగడం ఏం సరదాగా ఉంటుందండి? మీరు కూడా మాతోబాటు కూర్చుంటే నిండుగా ఉంటుంది."

"నేను తాగను కదండి" ఆమె సన్నగా నవ్వింది.

"మీరు తాగేవారయితే అసలు పిలిచేవాణ్ణే కాదు. అలాంటి ఆడవాళ్ళతో కలిసి అయిదేళ్ళపాటు ఇంచుమించు ప్రతిరాత్రి గడి పాను. మీరు కులాసాగా మా పక్కని కూర్చుంటే మేంచేసే కాని పని కూడా పవిత్రంగా ఉంటుంది. మీరసలు ఈ పాష్ హొటల్స్‌కి రారట. వాడు చెప్పాడు. అంచేత పార్టీ నా స్వీట్‌లోనే ఆరేంజ్ చేస్తాను. మనం ముగ్గురమే. ప్లీజ్..."

"ఆయనకి ఫోన్‌చేసి చెపుతా."

"అలాగే. అయితే వాడిచేత మీరు రానని చెప్పిస్తే మాత్రం నేనొప్పుకోను. వాడొక్కడూవస్తే, మీ ఇంటిదాకా తరిమికొడతాను. తప్పకండా రండి, ప్లీజ్. మీకు వ్రతభంగం చెయ్యాలనికాదు."

ఫోన్ పెట్టేసి అలాగే నిలబడింది కిటికీ పక్కని. ఎదురింటి సుందరమ్మ హిప్పీగాడితో ఏదో అంటూ విరగబడి నవ్వుతోంది.

ఛీ! సిగ్గుండొద్దూ అన్నేళ్ళొచ్చి. హిప్పీగాడు నల్లకళ్ళజోడులోంచి తనవంకే చూస్తున్నాడా? వాడి జులాయి చిరునవ్వు సుందరమ్మ నుద్దేశించా, తన నుద్దేశించా? 'రైంయి' మని గాలిలా వెళ్ళి

పోయాడు. కుర్రతనపు జోరులో సైకిలు మీద వయ్యారపు వేగంతో పోతుంటే చూడానికి సరదాగా ఉంటుంది. సుందరమ్మ జారినపైట సరిచేసుకోకుండానే అరుగుమీద కూర్చుంది. రిక్షాలో పోతున్న పెద్దమనిషి కళ్ళప్పగించి ఆమెవంకే చూస్తున్నాడు.

పక్క ఇంటి మలయాళీ ఇల్లాలు బుగ్గమీసాల ఆసామీతో సినిమాకి పోతోంది. వెనకసీట్లో కూర్చున్నారిద్దరూ. కారు గుండ్రటి దారిలో రైంయిమని తిరుగుతుంటే, ఆమె అతనివైపు ఒరిగింది, కారు రోడ్డులోకి మలుపు తిరిగి మాయమై పోయింది.

టైము మూడున్నర.

ఫోన్ ఎత్తింది. అలవాటైన నంబరు డయల్ చేసింది. అవతల ఫోన్ ఎత్తడంతోటే అంది, కొంటెగా తనకు తెలియనట్టు.

"ఏవండీ కారియర్‌కోసం నౌకరు రాలేదేం?"

"అమ్మా! అయ్యగారు కాంపు కెళ్ళారండి, వరంగల్" సెక్రటరీ గొంతు.

"ఎప్పుడొస్తారు?"

"సాయంత్రానికల్లా వొచ్చేస్తారు. ఒక అర్జంటు పని తగిలింది అనుకోకండా."

"సాయంత్రాని కొచ్చేస్తారని ఏమిటి?"

"వొస్తారండి. అర్జంటు కాగితాలున్నాయి. టైపుజేసి ఎనిమిదింటికి రిట్జ్ హొటల్‌కి నన్ను పట్టుకురమ్మన్నారు."

డిన్నర్‌కి వెళ్ళడానికి నిర్ణయించుకున్నారన్నమాట, తనతో ఒక్క మాటైనా చెప్పకుండా, ఏమిటీ అహంకారం? మొగరాజులు కదూ, నేనెలాగా రిట్జ్‌కి రానని తెలుసు. ఇంక వాళ్ళ ఇష్టం. ఆ సెక్రటరీని ఎందుకు పిలిచినట్టో, ఎందుకేమిటి? దాని ఫ్రాకూ, బాబ్ హెయిరూ, ఎర్రపెదిమలూ, ఎత్తు మడమల జోళ్ళూ. అయన గదిలో దాన్నికూడా కూచోబెడతారు, తాగుడుపోస్తూ. కాగితాల మీద సంతకాలట! అంత రాత్రివేళ ఎందుకో, పొద్దున్నే చెయ్యకూడదూ? దాని వాలకం చూస్తేనే తెలుస్తుంది, అది అలాంటి

'సరుకు' అని. తప్పకుండా తాగుడు. దానికి అలవాటే, ఏమయినా సరే వెళ్ళి వాళ్ళ గుట్టంతా బయటపెట్టాలి. అయన ఆ సెక్రటరీని తరుచు ఏ హొటల్‌కో తీసుకుపోతూనే ఉంటారేమో. ఆయన ఆటకట్టించాలి. ఏమయినాసరే.

స్నానం అలంకరణ అయేసరికి ఆరయింది. ఎందుకీ టిస్యూచీర? నిజంగా రిట్జ్‌కి వెళ్ళాలనే? ఛీ! అసలు ఆ జులాయి వాతావరణంలోకి తనెల్లా అడుగుపెట్టగలదు?

గాస్‌పొయ్యి అంటించి నీళ్ళుపెట్టింది. ఆఫీసు గదిలోకి వచ్చింది. ఫోన్ ఎత్తింది. ఎవరికి ఫోన్ చెయ్యాలని? పక్కఇంటి మలయాళీ ఇల్లాలు కారో ఒంటరిగా తిరిగి వచ్చింది. నిజంగా సినీమాకి పోయిందా, ఏదన్నా హొటల్‌కి పోయిందా ఆ బుగ్గమీసాల ఆసామితో. ఎంతకైనా తగును ఆవిడ.

పరధ్యానంగా ఫోన్ చేసింది. ఆఫీస్ నంబరు. ఎంతసేపటికీ ఎవరూ ఎత్తలేదు. పెట్టేసింది. సెక్రటరీ. ఇంటికి పోయింది. అలంకరించుకుని రిట్జ్ హొటల్ పోడానికి. సగం రొమ్ములు కనిపించే లోకట్ ఫ్రాక్ వేసుకుంటుంది. తొడలు కనిపించే మినీఫ్రాక్. ఎంతకైనా తెగిస్తున్నారు ఈ రోజుల్లో ఆడవాళ్ళు. సంసారులే చేస్తుంటే ఇంక అలాంటివాళ్ళకి లెక్కేమిటి?

అపవిత్రమైన ఈ లోకంలో తను పవిత్రత నిలబెట్టుకుంటోంది.

వంటింట్లోకి వచ్చింది. వంట చెయ్యను. వెడతాను. ఏమయినా సరే.

గాస్‌పొయ్యి ఆర్పేసింది.

పడకగదిలోకొచ్చి కసిగా పౌడరు మళ్ళీ అద్దుకుంది. సెంట్ స్ప్రే మీద చల్లుకుంది. వెడతాను. వెళ్ళి తీరుతాను.

ఆయన వరంగల్ నించి రాకపోతే? రాలేకపోతే? ఆమె గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఆ ఎగ్గెన్న దుర్మార్గుడు. తను లోపలికి రాగానే, తలుపు మూస్తాడు. హొటల్ గది తలుపు. సినీమాల్లో చూసిన 'రేప్‌సీనులు' ఎన్నో గుర్తుకొచ్చాయి. తనేం

చెయ్యగలదు? తన పవిత్రత అంతా ఒక రాక్షసుడి దౌర్జన్యానికి బలైపోతుంది.

ముచ్చెమటలు పోశాయి. తిరిగి స్నానం చేసింది. పవిత్రంగా బనారసు పట్టుచీర కట్టుకుంది. కుంకుడుకాయంత కుంకంబొట్టు పెట్టుకుంది. తల్లో మల్లెపువ్వుల చెండు పెట్టుకుంది. అద్దంలో చూసుకుంది. పురాణ ప్రసిద్ధులైన సీత, సావిత్రిని మరిపిస్తోంది తన రూపు. గర్వంగా తలెత్తి తన ప్రతిబింబాన్ని చూసుకుంది.

గడియారం ఎనిమిది కొడుతోంది.

తను సీతా సావిత్రి వంటి పతివ్రతే అయినట్టయితే తన్ను ఏ రాక్షసుడు మాత్రం ఏం చెయ్యగలడు? సీతని రావణుడు ఏం చెయ్యగలిగాడు? ఆ అగ్నిపరీక్షలో నెగ్గింది గనకే 'సీత' అయింది. తను భయపడి, తన పవిత్రతని అగ్నిపరీక్షకు గురిచెయ్యకపోతే ఇంక దానివిలువ ఏముంది? తను వెళ్ళాలి, ఇదొక సవాలు. తన జీవితానికే సవాలు.

ఆమె ఇల్లు తాళంవేసి టాక్సీ స్టాండుకేసి నడిచింది.

ఆఫీసు గదిలో టెలిఫోన్ ఆగకుండా మోగింది.